ప్రజాపక్షం
శనివారం, జనవరి 04

## మణిపూర్‌పై చొరవ ఏదీ?

జాతుల అంతఃకలహాలతో ఏడాదిన్నరగా అల్లకల్లోలంగా ఉన్న ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో శాంతిసాధనకు, స్థాపనకు కొత్త సంవత్సరంలోనైనా కేంద్రప్రభుత్వం ఏదైనా చొరవ కనబరుస్తుందా? ఆ సూచన కనిపించటం లేదు. అసలు అక్కడి సమస్యలో తమ ప్రత్యక్ష జోక్యం అవసరమని కేంద్రప్రభుత్వం గుర్తించినట్లే తోచదు. హోంమంత్రి సంవత్సరంలో ఇదిగో – ఇన్నిసార్లు ఈశాన్య రాష్ట్రాలు సందర్శించారన్న గణాంకాల ప్రకటన తప్ప కల్లోలిత మణిపూర్‌లో సాధారణ పరిస్థితుల పునరుద్ధరణకు ఏమి చేశారో వివరణ లేదు. 2024లో ఈశాన్యంలో క్రైమ్ ఘటనల్లో 77శాతం మణిపూర్‌లో జరిగాయని గణాంకాలు తెలుపుతున్నాయి. మణిపూర్ భౌగోళిక స్థితితో ఈ సమస్య ముడిపడి ఉంది. లోయ లేదా మైదాన ప్రాంతంలో మీతి జాతీయులు అత్యధిక మెజారిటీ. షెడ్యూల్డు ఆదివాసీ నివాసిత కొండ ప్రాంతాల్లో కుకీ తదితర ఆదివాసీ జాతీయులు మెజారిటీ. ముఖ్యమంత్రి బైరాన్‌సింగ్ సహా శాసనసభలో, మంత్రివర్గంలో మీతీలు మెజారిటీ. షెడ్యూల్డు ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసే హక్కు ఆదివాసీయేతరులకు లేదు. ఇది షెడ్యూల్డు ప్రాంతాల్లో దేశమంతటా అమలులో ఉన్న చట్టమే. అయితే తమను షెడ్యూల్డు తెగగా గుర్తించాలని మీతీలు చేసిన విన్నపాన్ని హైకోర్టు మన్నించటంతో తమ భూములకు ఎసరుపెడుతున్నారన్న అనుమానం కుకీల్లో తలెత్తింది. అసలే అది సాయుధ తిరుగుబాట్లకు నిలయమైన రాష్ట్రం. ప్రజాస్వామిక అశాంతిపై రాజ్యహింసతో మానభంగాలు, హత్యలు, గృహదహనాలు మొదలైనాయి. ఈ సున్నితమైన సమస్య పై రాష్ట్రప్రభుత్వం వెంటనే స్పందించి, కోర్టు తీర్పును అమలు జరపబోమని ప్రకటించి ఉంటే జాతుల మధ్య వైరాన్ని మొగ్గలోనే అణచివేసే అవకాశం ఉండేది. రాష్ట్రప్రభుత్వ మీనమేషాలు లెక్కిస్తూ ఆందోళనను అణచివేసేందుకు ప్రయత్నించటం, ముఖ్యమంత్రి కూడా మీతీ జాతీయుడు కావడం అగ్నికి ఆజ్యంపోసినట్లయింది. ఇంత జరుగుతు న్నా ప్రధానమంత్రి నరేంద్రమోదీ మౌనమునిగా ఉండటం, ఆ రాష్ట్రాన్ని సందర్శించి బాధిత ప్రజలకు సాంత్వన కలిగించే మాటలు చెప్పిఉంటే, తదనుగుణంగా చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి నేడున్నంత తీవ్రరూపం దాల్చి ఉండకపోను. తమ పార్టీ స్వార్థం రీత్యా అసెంబ్లీని రద్దు చేయకపోయినా సస్పెన్షన్‌లో ఉంచి పరిపాలనను కేంద్రం తమ చేతిలోకి తీసుకుని ఉండాల్సింది. సమస్యను కేవలం శాంతి–భద్రతల కోణం నుంచి చూశారేగాని జాతుల మధ్య వైరాన్ని అర్థం చేసుకోలేదు. ప్రధానమంత్రి మణిపూర్ సందర్శించాలని ప్రతిపక్షాలు విజ్ఞప్తి చేసినా మోదీ ఈ రోజుకూ ఖాతరు చేయకపోవటం విచారకరం. తమ రాష్ట్ర ప్రభుత్వాన్ని కాపాడుకోవటానికి ప్రాధాన్యత ఇవ్వటం సిగ్గుచేటు.

“ నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి బైరాన్‌సింగ్ రాష్ట్ర ప్రజలకు సందేశంలో తమ ప్రభుత్వం వైపునుండి కొన్ని తప్పులు దొర్లాయని, అందుకు ప్రజలు క్షమించాలని విజ్ఞప్తి చేశారు. సంవత్సరంన్నరగా నిమ్మకు నీరెత్తినట్లున్న ముఖ్యమంత్రి ఇప్పుడు క్షమాపణ కోరితే ప్రజలు శాంతిస్తారా? ముఖ్యమంత్రి క్షమాపణ కోరటంతోపాటు రాజీనామా ప్రకటించి ఉంటే సబబుగా,సమయోచితంగా ఉండేది. ”

నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి బైరాన్‌సింగ్ రాష్ట్ర ప్రజలకు సందేశంలో తమ ప్రభుత్వంవైపునుండి కొన్ని తప్పులు దొర్లాయని, అందుకు ప్రజలు క్షమించాలని విజ్ఞప్తి చేశారు. సంవత్సరంన్నరగా నిమ్మకు నీరెత్తినట్లున్న ముఖ్యమంత్రి ఇప్పుడు క్షమాపణ కోరితే ప్రజలు శాంతిస్తారా? ముఖ్యమంత్రి క్షమాపణ కోరటంతోపాటు రాజీనామా ప్రకటించి ఉంటే సబబుగా, సమయోచితంగా ఉండేది. కుకీలు తమ ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి బోర్డు కోరుతున్నారంటే మీతీలతో పరస్పరం కలిసి ఉండలేనంతగా విద్వేషాలు పెరిగినట్లు అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మంత్రివర్గం రాజీనామా చేయాలి. వివిధ జాతుల మధ్య చర్చలకు అనువైన వాతావరణం సృష్టించాలి. అన్ని తెగలకు, వారి ప్రజాప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించి సముచితమైన, విస్తృత ఆమోదయోగ్యత ప్రాతిపదికగా స్థూల ఏకాభిప్రాయ పరిష్కారాన్ని ఓర్పుగా, నేర్పుగా సాధించాలి. ప్రశాంత వాతావరణం ఏర్పడిన తదుపరి శాసనసభకు ఎన్నికలు జరపాలి. అంతేగాని ప్రస్తుత శాసనసభను పునరుద్ధరించే ప్రయత్నం చేయకూడదు. ఓట్లు–సీట్లు కన్నా ప్రజల్లో అశాంతిని చల్లబరిచి సామరస్యం సాధించటం ప్రధానం.

# డల్లేవాల్ మరణాన్ని మోదీ కోరుకుంటున్నాడా?

అరుణ్ శ్రీవాస్తవ

‘ఖనౌరీ సరిహద్దుకు భారీ సంఖ్యలో చేరుకుని, కేంద్రం దురహంకారానికి వ్యతిరేకంగా ప్రస్తుతం జరుగుతున్న సత్యాగ్రహాన్ని కాపాడండి’ అని పంజాబ్ యువతకు రైతు నాయకుడు జగ్‌జీత్ సింగ్ డల్లేవాల్ ఇచ్చిన పిలుపు బిజెపి నాయకత్వం దగాకోరుతనాన్ని బట్టబయలు చేసింది. 70 ఏళ్ల డల్లేవాల్ నవంబర్ 26 నుంచి ఐదువారాలకు పైగా ఆమరణ నిరాహార దీక్షలో ఉన్నారు. “నేను రైతు బిడ్డను. నేను బలహీనతను ప్రదర్శించను. నా దేశం కోసం నా ప్రాణాన్ని త్యాగం చేస్తాను. ఒక రైతు కొడుకు ఇక్కడ ఎందుకు కూర్చున్నాడు?” అని రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌కడ్ చేసిన వ్యాఖ్యలపై రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ ముఖంలోకి సూటిగా చూసి రైతుల డిమాండ్‌లను అంగీకరించాలని చెప్పే నైతిక సంకల్పం, బలం ఈ రైతు బిడ్డలో లేదన్నది వేరే విషయం. మోదీ ఉద్దేశ్యాలను ఆందోళన చేస్తున్న రైతులు విశ్వసించేలా చేయడమే ధన్‌ఖడ్ డిసెంబర్ 13 ప్రకటన ప్రధాన లక్ష్యం. కానీ యువతకు డల్లేవాల్ నుంచి వచ్చిన ఏక వాక్య విజ్ఞప్తి మోదీ ద్వంద్వవైఖరిని బట్టబయలు చేసింది.

రైతుల ఉద్యమంపై మోదీ, ఆయన మంత్రులు గందరగోళం సృష్టించడం చిరాకు కలుగచేస్తున్నది. ఇది పంజాబ్ కేంద్రంగా సాగుతున్న ఆందోళన అని, సిక్కు రైతులు మాత్రమే దీనికి నాయకత్వం వహిస్తున్నారని మోదీ మంత్రులు చెబుతున్నారు. ఈ కథనం ‘సిక్కులు తనకు వ్యతిరేకమని మోదీ భావిస్తున్నారా? ఆయన ఈ అభిప్రాయాన్ని కలిగి ఉన్నట్లయితే, ఆయన అందుకు కారణం కూడా తెలుసుకోవాలి. వాస్తవాలను ప్రధాని ఎందుకు ప్రజల్లోకి తీసుకెళ్లరు? దానికి బదులుగా వాస్తవాన్ని దాచిపెట్టి, ఒక వక్రీకరించిన కథనాన్ని ఎందుకు చూపిస్తున్నారనే’ ప్రశ్నను లేవనెత్తింది. సుదూర రాష్ట్రాల రైతులు పాల్గొనడం లేదని కాదు, వారి భాగస్వామ్యం తక్కువ. పంజాబ్ , హర్యానాలు ఢిల్లీకి పొరుగునే ఉన్నందున, తూర్పు ఉత్తరప్రదేశ్ , బీహార్ రైతులతో పోలిస్తే ఈ రెండు రాష్ట్రాల రైతులు త్వరగా ఢిల్లీకి వెళ్లడం సులభం. రైతుల డిమాండ్లను అంగీకరించేందుకు నిరాకరిస్తున్న ప్రభుత్వాన్ని సమర్థించేందుకు కొందరు మోడీ మద్దతుదారులు ఆశ్చర్యకరమైన వివరణతో ముందుకు తీసుకువస్తున్నారు. రైతులను ఆదుకునేందుకు అదానీ, ఇతర జాతీయవాద కార్పొరేట్ సంస్థలను రైతులు అనుమతించడం లేదని, రెండేళ్ల క్రితమే ప్రధాని నరేంద్ర మోదీ కందులు దిగుమతిని నిషేధించారని వారు చిత్రంగా వాదిస్తున్నారు.

కానీ వ్యాపార ప్రయోజనాల కారణంగా విదేశాల్లో నివసిస్తున్న పంజాబీ సిక్కులు, కాంగ్రెస్ నాయకుడు అమరీందర్ సింగ్, కమల్‌నాథ్ వంటి వారు మోదీ చర్యను వ్యతిరేకించారు. ‘ఖలిస్తానీలు తమ ఉద్యోగాలను కోల్పోవడం మొదలైంది. అందుకే జస్టిన్ ట్రూడో రైతుల ఉద్యమానికి మద్దతు ఇచ్చాడు’ అంటూ అత్యంత తలతిక్క చేశారు. ‘అదానీ , అంబానీ గ్రూపులు విదేశీ గుత్తాధిపత్యాన్ని అంతం చేయడం ద్వారా, భారతీయ వినియోగదారులకు విపరీతమైన ప్రయోజనాలను అందించడం ద్వారా, అవి ప్రారంభించిన అన్ని వ్యాపారాలలో లాభాలను ఆర్జించాయి’ అని కూడా వారు వాదించారు. బిజెపి మద్దతుదారులు రైతుల డిమాండ్లపై గందరగోళం సృష్టిస్తున్నారనడంలో సందేహం లేదు.

ఢిల్లీలో ప్రదర్శనకు రాకుండా రైతులను భద్రతా దళాలు అడ్డుకున్న తరువాత ఫిబ్రవరి 13 నుండి డల్లేవాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా (రాజకీయేతర),కిసాన్ మజ్దూర్ మోర్చా కార్యకర్తలు పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు ప్రాంతాల వద్ద శిబిరాలు వేసుకొని ఉన్నారు. కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పి)ప్రభుత్వం చట్టబద్ధంగా హామీ ఇవ్వాలన్నది వారి డిమాండ్. ఇది రైతుల హక్కులు, అభ్యున్నతి కోసం జరుగుతున్న పోరాటం, అయితే ఈ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణిచివేయాలని భావిస్తోంది. రైతులు కూడా భారతదేశంలో భాగమే, మా ప్రజాస్వామ్య హక్కులు నెరవేర్చబడకపోతే మేము మా జీవితాలను త్యాగం చేయాలనుకుంటున్నామని డల్లెవాల్ చెప్పారు.

ఇవి 2020–21లో ఏడాదిపాటు ఆందోళన చేపట్టిన రైతుల పాత డిమాండ్లు. సెప్టెంబరు 2020లో పార్లమెంట్ ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా వారు నిరసన తెలిపారు. ఈ చట్టాలను రైతు సంఘాలు ‘రైతు వ్యతిరేక చట్టాలు’గా అభివర్ణించాయి. కార్పొరేట్ సంస్థలు వ్యవసాయోత్పత్తుల ధరలను నియంత్రించకుండా ఉండేందుకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) బిల్లును రూపొందించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. మూడు వ్యవసాయ చట్టాలపై రైతులను ఒప్పించడంలో ప్రభుత్వం విఫలమైన తరువాత ప్రధాని మోదీ బహిరంగ క్షమాపణ చెప్పాకే రైతులు తమ ఆందోళనను విరమించుకున్నారు. ‘నిజమైన ,స్వచ్ఛమైన హృదయంతో నేను దేశ ప్రజలకు క్షమాపణలు చెబుతున్నాను... మేము రైతులను ఒప్పించలేకపోయాము. మా ప్రయత్నాల్లో కొంత లోపం ఉండి, కొంతమంది రైతులను ఒప్పించలేకపోయాం’ అని మోదీ అన్నారు. డల్లేవాల్ ఆరోగ్యం నిరంతరం క్షీణిస్తున్నప్పటికీ, శరీర నిర్మాణ సంబంధమైన, శారీరక పారామితులన్నీ క్షీణిస్తున్నప్పటికీ, ప్రధానమంత్రి చలించకుండా, ఆయనతో మాట్లాడటానికి ఇష్టపడకపోవడాన్ని బట్టి ఆందోళన పట్ల మోదీ చలించని వైఖరిని మనం అర్థం చేసుకోవచ్చు.

డల్లేవాల్‌ను పరీక్షించిన వైద్యులు అయన శరీరంలో కీటోన్ స్థాయి సాధారణం కంటే 25రెట్లు ఎక్కువగా ఉందని, అతను దాదాపు 15కిలోల బరువు కోల్పోయాడని, ఆకస్మిక కార్డియాక్ అరెస్ట్ లేదా బహుళ అవయవ వైఫల్యానికి గురయ్యే అవకాశాన్ని తోసిపుచ్చలేమని చెప్పారు. ఆయనకు గతంలో నిర్ధారించబడిన ప్రోస్టేట్ క్యాన్సర్ కోసం మళ్ళీ నిర్వహించిన పిఎస్‌ఎ పరీక్ష రిపోర్ట్‌లు అసాధారణంగా ఉన్నాయి. డల్లేవాల్ నిరాహారదీక్ష పట్ల ప్రధాని మోదీ పట్టింపులేని వైఖరి, డల్లేవాల్ జీవించి ఉన్నాడా లేదా చనిపోయాడా అనే ఆందోళన మోదీకి లేదన్న వాస్తవాన్ని నొక్కి చెబుతోంది. డల్లేవాల్ డిమాండ్లు చాలా సామాన్యమైనవి : రుణమాఫీ, పింఛన్లు, విద్యుత్ ఛార్జీల పెంపు నిలుపుదల, ఎంఎస్‌పికి లీగల్ హామీలే కాకుండా ఆందోళన చేస్తున్న రైతులపై పెట్టిన పోలీసు కేసుల ఉపసంహరణ. వాస్తవానికి, ఇందులో లఖీంపూర్ ఖేరీలో 2021లో నాటి బిజెపి కేంద్ర మంత్రి అజయ్ ‘తేని’ మిశ్రాకు చెందిన కారు చక్రాల కింద నలిగిన రైతులు, బాధితులకు ‘న్యాయం’ అనే అంశం కూడా ఉంది. ఈ విషయం ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉంది.

డల్లేవాల్‌తో చర్చలు జరపాలని మోదీ ప్రభుత్వాన్ని ఆదేశించే బదులు, నిరసన స్థలం చుట్టూ దుర్భేధ్యమైన ఏర్పాటును పంజాబ్ ప్రభుత్వం ఎందుకు అనుమతించిందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. డల్లేవాల్ మరణానికి దారితీసే విధంగా ఉన్న రైతుల ఆందోళనకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ఇస్తున్నట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఏదైనా రాజీ మార్గాన్ని చూపిస్తే డల్లేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చేందుకు రైతులు అంగీకరించవచ్చని పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ చెప్పిన తర్వాత కూడా కోర్టు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.పంజాబ్ ప్రభుత్వాన్ని నిలదీసే బదులు కోర్టు మోదీని ఒక పరిష్కారం కనుగొనవలసిందిగా కోరాల్సింది. పంజాబ్ ప్రభుత్వం బలవంతంగా ఆయనను తీసుకువెళుతుందనే భయంతో రైతులు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు.డల్లేవాల్‌కు కాపు కాస్తున్నారు. డల్లేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చకుండా అడ్డుకునే వారు రైతు సమాజానికి ఒక గొప్ప నాయకుడిని లేకుండా చేయాలనుకుంటున్నారని నిరసన స్థలంలో ప్రజలకు తెలియజేయాలని కోర్టు ఉన్నతాధికారులను ఆదేశించింది. ఇది అసంబద్ధమైంది. ఒకవేళ కోర్టు నిజంగా ఆందోళన చెందితే, తగిన చర్యలు తీసుకోవాలని మోదీ ప్రభుత్వాన్ని ఆదేశించాలి.

అన్ని పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీని అమలు చేయాలని, ఎం.ఎస్.స్వామినాథన్ ఫార్ములా ప్రాతిపదికగా ఎంఎస్‌పిని లెక్కించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. స్వామినాథన్ కమిటీ ఫార్ములా ప్రకారం అన్ని ఖర్చులకు 50 శాతం లాభం కలిపి అన్ని పంటలను ఎంఎస్‌పి నిర్ణయించాలి. రైతులు ఆందోళన విరమణ సందర్భంలో ఎంఎస్‌పికి లీగల్ గ్యారంటీని మోదీ హామీ ఇచ్చారు. 2024 ఎన్నికల ప్రచారంలో కూడా అన్ని పంటలను ఎంఎస్‌పికి ప్రభుత్వం కొంటుందని ప్రధాని చెప్పారు. ఇప్పుడెందుకు వెనకడుగువేసి రైతుల్ని దగా చేస్తున్నారు?

(ఐపిఎ సర్వీస్)



డల్లేవాల్ నిరాహార దీక్ష శిబిరం వద్ద రైతుల రక్షణ కవచం

## అమిత్ షా ఎందుకీ అవహేళన?



మన్నారం నాగరాజు
95508 44433

అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్.. అనడం ఇప్పుడు ఫ్యాషన్ అయిపోయింది. అలా పదేపదే అంబేద్కర్ పేరు స్మరించే బదులు ఏ దేవుడిని స్మరించుకున్నా ఏడు జన్మల దాకా స్వర్గప్రాప్తి లభించేది అంటూ కేంద్ర హోంశాఖ మంత్రి, బిజెపి అగ్రనేత అమిత్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం లేపాయి. ఈ ప్రకటన అంబేద్కర్‌ను అవమానించేలా ఉంది. అంబేద్కర్‌ను జీవితాంతం అవమానించి, ఆయన సిద్ధాంతాలను పక్కనబెట్టి, కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు భారతరత్న ఇవ్వకుండా, రిజర్వేషన్ సూత్రాలను తుంగలో తొక్కినవారే నేడు ఆయన పేరుతో గందరగోళం సృష్టిస్తున్నారని అమిత్ షా తిరిగి ఆరోపించారు. మరోవైపు, అంబేద్కర్ గౌరవార్థం ఎన్‌డిఎ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో తన మంత్రిని డిఫెండ్ చేసుకున్నారు. అయితే, వివాదం ఇంతటితో ముగియలేదు. అమిత్ షా రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించారంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆరోపించారు.

అమిత్ షా రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. బాబా సాహెబ్‌ను, రాజ్యాంగాన్ని అవమానించారని, అంబేద్కర్ రాజ్యాంగాన్ని గౌరవించకూడదని వారి ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం తెలియజేస్తోందని ఖర్గే ఆరోపించారు. అదే సమయంలో అంబేద్కర్ పేరుతో కాంగ్రెస్, బిజెపిలు రాజకీయం చేస్తున్నాయని బిఎస్‌పి అధినేత్రి మాయావతి విమర్శించారు. దోపిడీ నుంచి విముక్తి కల్పించే వ్యక్తి దేవుడైతే.. కుల ఆధారిత భారతీయ సమాజంలోని కోట్లాదిమంది ప్రజల దేవుడు అంబేద్కర్. ఆయన శతాబ్దాలుగా సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా వివక్షకు గురైన షెడ్యూల్డ్ వెనుకబడిన వర్గాల వారికి రాజ్యాంగం ద్వారా సమానత్వ హక్కును కల్పించారు. అందుకే అమిత్ షా ప్రకటన అంబేద్కర్‌ను అవమానించేలా ఉందని బాబాసాహెబ్ భావజాలం, దళిత రాజకీయాలతో సంబంధమున్న వ్యక్తులు భావిస్తున్నారు. ఇది అక్షర సత్యం.

అయితే ప్రస్తుతం అంబేద్కర్ విషయంలో అన్ని రాజకీయ పార్టీల మధ్య పోటీ ఉంది. అంబేద్కర్ ఆలోచనలను అమలు చేయకుండా, రాజకీయ పార్టీలు ఆయన గుర్తింపును ఉపయోగించుకుని దళిత ఓటర్లను ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నయ్. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన ప్రకటనతో బిజెపి డిఫెన్స్‌లో పడింది. దళిత, వెనుకబడిన వర్గాల ఓటర్లను ఆకర్షించడానికి గత కొన్నేళ్లుగా బిజెపి ప్రయత్నాలు చేస్తోంది. దీనికి చాలా కారణాలున్నాయి. భారతీయ జనతా పార్టీ అంటే బ్రాహ్మణులు, బనియాల పార్టీ అని చెప్పేవారు. కానీ, దశాబ్ద కాలంగా బిజెపి ఈ గుర్తింపును దాటి హిందూ సమాజంలోని ఇతర కులాలకు కూడా వెళ్లడంలో విజయం సాధించింది. కుల రాజకీయాల ఆధిపత్యం లేకుండా, హిందూ గుర్తింపు రాజకీయాలు బలపడాలని బిజెపి ప్రయత్నించింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధానంగా మహారాష్ట్రలోని అగ్రవర్ణాల సంస్థ, ముఖ్యంగా బ్రాహ్మణులది. అందుకే మొదట్లో షెడ్యూల్డ్ కులాలు దీనికి ఆకర్షితులు కాలేదు. ఆర్‌ఎస్‌ఎస్‌లో బ్రాహ్మణవాదంపై విమర్శలకు ఆస్కారం లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం సమానత్వం కాదు, సామరస్యం. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు ఓటు బ్యాంకు రాజకీయాలు చేయాలనుకుంటే హిందూ ఓటర్లలో ఐక్యతను సృష్టించాలి. అయితే దళిత, ఒబిసి వర్గాల ఓట్లను పొందకుండా అది సాధ్యం కాదని సర్వత్రా అభిప్రాయం వ్యక్తం అవుతున్నది. బిజెపి ఆవిర్భావానికి ముందు నుంచే ఆర్‌ఎస్‌ఎస్ దీనికోసం ప్రయత్నాలు చేసింది. 1974లో బాలాసాహెబ్ దేవరస్ ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్‌గా ఉన్నప్పుడు ఆ సంస్థ తన వైఖరిని మార్చుకుంది. అంబేద్కర్, పెరియార్, మహాత్మా పూలే పేర్లను ఉదయం ప్రార్థనల్లో చేర్చింది. అంతేకాకుండా దళితులు, గిరిజనులను తనవైపు ఆకర్షించే కార్యక్రమాలను ప్రారంభించింది. సమానత్వం, సామరస్యం రెండు వేర్వేరు విషయాలు. బిజెపి సామరస్యం గురించి మాట్లాడుతుంది కాని, సమానత్వం గురించి కాదు. సమానత్వం అనేది అంబేద్కర్ ప్రాథమిక ఆలోచన. అయితే, ఓటు రాజకీయాలకు అనేక మార్గాలున్నాయి. అమిత్ షా వ్యాఖ్యలతో పెద్దగా ఆశ్చర్యపోనవసరం లేదు. ఆయనకు అనిపించినదే చెప్పారు. భీమా కోరేగావ్ సంఘటన తర్వాత మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అంబేద్కరిస్టులను అణచివేసింది. బిజెపి అంబేద్కర్ ఇమేజ్‌ను మాత్రమే ప్రచారం చేసింది, ఆయన భావజాలాన్ని కాదు. ఈ విషయం గమనంలో ఉంచుకోవాలి.

డాక్టర్ అంబేద్కర్ శూద్రులపైన, అస్పృశ్యతపైనా, కుల వ్యవస్థపైనా కొన్ని గ్రంథాలు రాశారు. అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రచించిన మేధావి, అధ్యయనశీలి, ఆర్థికవేత్త, న్యాయశాస్త్ర కోవిదుడు, రచయిత బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన పట్లా కేంద్ర హోంశాఖ మంత్రి, బిజెపి అగ్రనేతకి అంత అక్కసు ఎందుకు? దేశ ప్రజల మనోభావాలు ఎంతగా దెబ్బ తింటున్నాయో పట్టించుకోరా? అధికార బలం ఉందికదా అని తప్పుడు మాటలు మాట్లాడినా, బహుజన వర్గాలు ఊరుకుంటారా? బాధ్యత గల పదవిలో ఉన్నప్పుడు ఆచితూచి మాట్లాడలేరా... ఇంత అహంకారం ఎందుకో అని ప్రజలు విమర్శిస్తున్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగానే కాకుండా సామాజిక న్యాయం, సమానత్వం, మరియు మానవ హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప సంఘసుధారకుడు. ఆయన కృషి వల్లే సమాజంలోని అణగారిన వర్గాలకు న్యాయం దక్కింది. రకరకాల విజన్లను తెరమీదకు తీసుకువస్తున్న పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే అంబేద్కర్ విజన్ ను రూపొందించాలి. నిర్ణీత కాలవ్యవధిలో ఆయన ఆకాంక్షించిన లక్ష్యాలను చేరుకోవడానికి ప్రణాళికను ప్రకటించి అమలు చేయాలి.

## బ్రెయిలీ లిపి అంధులకు వరం



జనవరి 4, లూయి బ్రెయిలీ జన్మదినం

ఎంతోమంది అపారమైన ప్రజ్ఞావంతులు ఈ భువిపై స్వల్పకాలం జీవించి, తమ అనన్య సామాన్యమైన ప్రతిభతో ప్రపంచానికి వివిధ రూపాల్లో సేవలందించి, మరణించి, శతాబ్దాలు గడిచినా ప్రజల హృదయాల్లో సజీవులుగా కొలువై ఉన్నా రు. జనంకోసం జీవించి, జనంకోసం తపించి, అలుపెరుగని శ్రమతో తమ జీవితాలను ఇతరుల శ్రేయ స్సు కోసం వెచ్చించిన మహనీయులను జ్ఞప్తియందుంచుకోవడం మన కనీస ధర్మం. గణితం కోసమే జీవితమన్నట్టు బ్రతికి, గణిత ప్రపంచాన్ని శాసించిన శ్రీనివాస రామానుజన్ గణితాన్ని శ్వాసిస్తూ ఆస్వాదిస్తూ అంతిమ శ్వాస వదిలాడు. అలాగే అంధు లకోసం శ్రమించి, అంధత్వంలోనే వెలుగు రేఖలు పూయించి, సమాజం చేత నిర్లక్ష్యం చేయబడుతున్న అంధులకు ప్రత్యేక లిపి కనిపెట్టి, వారిని జ్ఞానవంతులుగా తీర్చిదిద్ది, వారి ఆలోచనలను, వారి జ్ఞానాన్ని ప్రపంచానికి వినియోగపడేటట్టు చేసిన ‘లూయీ బ్రెయిలీ’ అంధుల పాలిట ఆరాధ్యదైవం. సర్వేంద్రియానాం నయనం ప్రధానం అన్నారు. కంటిచూపుకు నోచుకోకపోతే, మన ముందు ఎన్ని అద్భుతాలు జరుగుతున్నా, వినడమే తప్ప వీక్షించడం జరగదు. మనసు తో వీక్షించి, మస్తిష్కానికి పదునుపెట్టి, రాజ్యాలను ఏలిన రాజుల గురించి పురాణకాలం నుంచి కథలుగా వింటున్నాం. కలలో సైతం సాధ్యంకాని అద్భుతాలను ఇలలో సుసాధ్యం చేసిన ప్రజ్ఞావంతుల జాబితాలో లూయీ బ్రెయిలీ స్థానం మహత్తరమైనది. అంధత్వం శాపం కారాదని, అంధుల కోసం చుక్కలతో కూడిన లిపిని రూపొందించి, అప్పటికే అమల్లో ఉన్న నామమాత్రపు అంధుల లిపిని సరళీకరించి, గుర్తింపుతెచ్చిన బ్రెయిలీ కృషి నిరుపమానం. బాల్యంలోనే రెండుకళ్ళను కోల్పోయిన బ్రెయిలీ నిరుత్సాహ పడకుండా తన ప్రతిభతో తనను తాను తీర్చిదిద్దుకుని, ప్రొఫెసర్‌గా మారి, అంధుల లిపి కోసం అహరహం కృషి చేసాడు. బ్రెయిలీ కంటే ముందుగానే ఎంతోమంది అంధుల భాషకు అక్షర రూపమివ్వాలని భావించి, అంధులకు ప్రత్యేకంగా పుస్తకాలు తయారు చేయడానికి ఎంతగానో కృషి చేసారు. కాని ఆ కృషిలో వారు పూర్తి స్థాయిలో సఫలీకృతం కాలేకపోయారు. 4వ సంవత్సరం వరకు ప్రపంచాన్ని తన కళ్ళతో చూసిన వ్యక్తికి హఠాత్తుగా కళ్ళుపోతే, అప్పటి వరకు చూసిన ప్రపంచం శూన్యంగా అగుపిస్తే, చుట్టూ అంధకారం అలముకుని, నిరాశానిస్పృహలతో జీవితం అయోమయంగా, అస్తవ్యస్థంగా మారితే ఆ పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడమే కష్టం. అలాంటి ఉద్విగ్న మానసిక సంఘర్షణలో జనించిన ఒక చిన్న ఆలోచన సమున్నతమైన పరిశోధనకు తెరతీసింది. అంధుల లిపికి శ్రీకారం చుట్టింది. అంధులకు ఆరుచుక్కల్లోనే అక్షరాలను, చిహ్నాలను తయారుచేసి, కేవలం చేతి వేళ్ళ స్పర్శతో సమస్త ప్రపంచాన్ని అంధులకు ప్రసాదించిన ‘లూయీ బ్రెయిలీ’ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయా రు. బ్రెయిలీ లిపి అంధులకు ఆశాకిరణంలా మారింది. ఆయన మరణించి 172 సం. లు దాటినా ఈనాటికీ స్మరించుకుంటున్నామంటే ఆయన అంధుల కోసం, అంధుల లిపి కోసం చేసిన కృషి ఎలాంటిదో అవగతమవుతున్నది.



సుంకవల్లి సత్తిరాజు
9704903463

## ‘సినిమా సంస్కరణ’లకు సరైన సమయం ఇదే

ఏదైనా ఒక సామాజిక సమస్య ఏర్పడ్డప్పుడు దానిపై ప్రజలు మాట్లాడుతారు, విభిన్న కోణాలలో చర్చిస్తారు. ఇలాంటి సమయంలో వార్తాపత్రికలలో, సామాజిక మాధ్యమాలలో, టి.వి లాంటి ప్రసార సాధనాలలో ఆ సమస్య కొన్నాళ్లు నలుగుతుంది. ఇక్కడ రెండు రకాలుగా ఆ సమస్య సమాజం నుండి మాయమవుతుంది. ఒకటి సమస్యకు తగిన పరిష్కారం దొరకడం, రెండు పరిష్కారం లభించకుండానే నీరుగారిపోవడం. ఇప్పుడు ఎందుకు ఈ ప్రస్తావన అంటే ఈ మధ్యన ‘పుష్ప 2’ సినిమా అనేక రకాలుగా హల్చల్ చేస్తూనే ఉంది. ఈ సినిమా ‘ప్రీమియర్ షో’లో జరిగిన సంఘటనలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు అసెంబ్లీలో చేసిన ప్రసంగం నిజంగా ‘నిజాలు’ ను ప్రతిబింబించింది. ఇటువంటి తరుణంలోనే తెలుగు ‘సినిమా’ సమస్యలకు పరిష్కారం వెతకవలసిన బాధ్యత ఇటు సమాజం, అటు ప్రభుత్వాలపైన ఉంది.

**తెలుగు సినిమా ప్రత్యేకతలు:** దేశ వ్యాప్తంగా మన తెలుగు సినిమాకు ప్రత్యేకత ఉంది. సామాజిక దురాచారాలను అంతమొందించే చిత్రాలను రూపొందించిన ఘన చరిత్ర మన తెలుగు సినిమాది. సమాజంలో ఉన్న వివిధ వర్గాలపై, వ్యవస్థలపై సినిమా ప్రభావం మెండుగా ఉంటుంది. అది మంచైనా లేదా చెడైనా సరే !

సినిమా ప్రధాన లక్ష్యం ప్రేక్షకులకు విలువలతో కూడిన వినోదాన్ని, ఆనందాన్ని అందించడం. కొన్ని సామాజిక సమస్యలను స్పృశించి ప్రజలలో మార్పు తేవడం. సమాజానికి ‘మంచి సందేశాన్ని’ అందించడం. కానీ ప్రస్తుతం వస్తున్న కొన్ని సినిమాలలో వినోదం మాట దేవుడెరుగు! యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయి. ఇప్పుడు సినిమా పక్కా వ్యాపారం. అధిక లాభాలు సంపాదించే ఒక అందమైన బిజినెస్.

**వినోదం తక్కువ ! అశ్లీలం ఎక్కువ:**

ప్రజాస్వామ్య సమాజాలలో ప్రభుత్వ వ్యవస్థలే పట్టుగొమ్మలు. అటువంటి వ్యవస్థలను తప్పుడుగా చూపించే కథాంశంగా ఉండే సినిమాలు వస్తున్నాయి. వీటిలో వాస్తవానికి దూరంగా ఉండే అంశాలు ఉంటున్నాయి. ‘ సినిమాలో హీరో అన్నింటికీ అతీతుడు. ఎంతమందినైనా ఒంటిచేత్తో కొడతాడు. అలా కొడితేనే మరి హీరో ! ఎన్నో వికృత చేష్టలు చేసినా తప్పు లేదు. అశ్లీల పదాలు వాడొచ్చు. తప్పుచేసే వ్యక్తులకు న్యాయస్థానాలతో పనిలేకుండా శిక్షిస్తాడు. వీలైతే ఆగ్రహావేశాలతో చంపేస్తాడు. ఇటువంటి చిత్రాల వలన వ్యవస్థలపై ప్రజలకు నమ్మకం పోయేలా ఒక నెగిటివ్ భావనను కలిగిస్తున్నాయి. హీరో పాత్ర సమాజం దృష్టిలో పాజిటివ్‌గా ఉండాలి. అంతే తప్ప ఒక స్మగ్లర్ని కూడా హీరోగా చూపిస్తే సమాజానికి ఆ సినిమా ఇచ్చే ‘సందేశం’ ఏమిటి? విద్యాపరంగా ఉన్నత స్థానాల్లో ఉండే ఉపాధ్యాయులపై సెటైర్లు, కౌంటర్లు వేస్తూ గురువులను ఒక జోకర్‌లా చూపించే పాత్రలను మన దర్శకులు సృష్టిస్తున్నారు.ఇదేనా చిత్రాలు గురువులకు ఇచ్చే గౌరవం! ఇటువంటివి విద్యార్థులు చూసి నిజ జీవితంలో ఆచరించారా?



గురువు మాట వినేదెవరు. ఒక హీరో (స్మగ్లర్ ) తన తోటి స్మగ్లర్లను జైలు నుండి తీసుకుపోడానికి పోలీస్ స్టేషన్‌లో ఉన్న పోలీసులను కొంటాడా? ఇది దుర్మార్గమైన చర్య కాదా? వ్యవస్థలను డబ్బుతో కొనేస్తాడా? ఒక ముఖ్యమంత్రి తనతో కలిపి ఫోటో తీయించుకోలేదని సిఎంనే మార్చుతాడా? ఈ చర్యకోసం ఎర్ర చందనాన్ని విదేశాలకు అక్రమంగా తరలించి సంపాదించిన డబ్బును ఉపయోగించడమా? వారి దృష్టిలో ఒక ప్రజానాయకుడును డబ్బుతో మార్చేస్తారా! వాళ్ళకే తెలియాలి. దేశ చరిత్రలో ఇలా ఎక్కడైనా, ఎప్పుడైనా జరిగిం దా? కొన్ని సినిమాలలో జుగుప్సాకరమైన, ద్వంద్వార్థాలు వచ్చే భాషను వాడుతున్నారు. ఇక ప్రతీ సినిమాలలో ఒక ఐటెం సాంగ్ ఉండాలి ! వంటిమీద చాలీ చాలనట్లుగా కురచ దుస్తులతో మహిళలు నృత్యాలు! వెనుక కల్లు తాగిన కోతుల్లా సొంగ కార్చుకుంటూ యువత! నిజ జీవితంలో ఇలాంటివి ఉన్నాయా? నాయిక వాలకం చూస్తే ఫుల్‌ఎక్స్‌పోజింగ్ (అశ్లీలత)! ఇది మహిళలను అవమానించడం కాదా!

**‘శృంగార నైషధం’ కావ్యాన్ని రచించిన శ్రీనాథుడు ఇప్పుడు ఉండి ఉంటే ఏమి చేసే వారో ?**

విద్యార్థులు మద్యం త్రాగినా తప్పు లేదు అన్న భావంతో కొన్ని సీన్స్ ఉంటున్నాయి. ‘మద్యపానం సేవించడం, పొగ త్రాగడం హానికరం’ అని ఒక వాక్యం చూపించేస్తే సరిపోతుందా! సినిమాలలో ఇటువంటి అశ్లీల దృశ్యాలు చూసి యువత ఎందుకు పెడతోవపట్టరు? దీనికి కారకులెవరు?

**సినిమా వ్యూహం:** సినిమా విడుదలకాక ముందే రకరకాలైన పేర్లతో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ షోలలో విడుదల కాబోయే సినిమా గురించి ఒక కృత్రిమ హైప్ సృష్టిస్తున్నారు. ఫట్ అయిన చిత్రాల్ని కూడా హిట్ చేసే కొన్ని ఏజెన్సీలు ఉన్నాయి. వీరు వివిధ సామాజిక మాధ్యమాల్లో చెత్త సినిమాలకోసం ఊదర కొట్టి కొట్టి మన కర్ణబేరిలకు కన్నాలు పెడుతున్నారు. ఇంకా ఒక సినిమాని పార్ట్ 1, పార్ట్ 2 అని విడదీసి రెండుసార్లు ప్రేక్షకులను సినిమాహాళ్ళకు రప్పించి వాళ్ళ జేబులకు చిల్లు వేస్తున్నారు. ఏమీ తెలియని సామాన్య ప్రేక్షకులు ఇవి నిజాలని నమ్మి సినిమాలు చూసేస్తున్నారు. సెన్సార్ వాళ్ళు ఈ సినిమాలను చూసి సర్టిఫికేట్ ఇస్తున్నారా? లేక చూడకుండా ఇస్తున్నారా? అనే సందేహం ఇటువంటి అనైతిక, అశ్లీల సినిమాలను చూసే సామాన్యుడి మెదడులో మెదులుతున్న ప్రశ్న.

**సంస్కరణలు అవసరం:** భారీ బడ్జెట్‌తో తీసిన సినిమాలపై ఎక్కువ శాతం పన్ను ను ప్రభుత్వం విధించాలి. ఇంకా ఎట్టి పరిస్థితులలో కూడా సినిమా టికెట్ ధరలు పెంచుకోడానికి అవకాశం ఇవ్వకూడదు. ఒక నగరంలో సగం కంటే ఎక్కువ సినిమా హాళ్లలో రిలీ జ్ కాకుండా నిబంధనపెట్టి చిన్న సినిమాలను బ్రతికించాలి. ప్రీ రిలీజ్ ఈవెంట్స్ జరిపేటప్పుడు ఏవైనా జరగరాని సంఘటనలు జరిగితే ఆ సినిమా యూనిట్ వారిని బాధ్యుల్ని చేయాలి.

**మార్గదర్శకాలు అవసరం:** ప్రతీ సినిమా కొన్ని మార్గదర్శకాలకు అనుగుణంగా చిత్రీకరించేటట్లుగా చట్టం చేయాలి. అవి ఒక చిత్రం వినోదాత్మకంగా ఉండాలి. సమాజానికి కీడు చేసే విధంగా ఉండగూడదు. అశ్లీలతకు, అనైతికతకు తావుండగూడదు. కుటుంబ సమేతంగా చూసే విధంగా ఉండా లి.



జనక మోహన రావు దుంగ
8247045230

## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన తహసీల్దార్ చల్ల ప్రసాద్



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ వరంగల్ హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల తహసీల్దార్ చల్ల ప్రసాద్ శుక్రవారం ప్రజాపక్షం పత్రిక క్యాలెండర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడే పత్రికలు కొన్ని ఉంటాయని అందులో ప్రజాపక్షం పత్రిక అగ్ర భాగాన ఉందన్నారు. పత్రికలు ప్రజలు ప్రభుత్వానికి వారధిగా ఉండాలని, వాస్తవాలను మాత్రమే ప్రచురించాలన్నారు. పత్రికలలో ప్రచురితమయ్యే వార్తా కథనాలు సమగ్రతతో ఉంటాయని అలాంటివి ప్రజలకు విజ్ఞానాన్ని అందిస్తాయని, ప్రజల సమస్యలు ప్రభుత్వానికి తెలిసే విధంగా పత్రికలు వారధిగా పనిచేయాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే విధంగా పత్రికలు పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హసన్ పర్తి మండల తాసిల్దార్ చల్ల ప్రసాద్, డిప్యూటీ తాసిల్దార్ ఎండి రహీం పాషా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫాజిల్, హసన్ పర్తి మండల ప్రజాపక్షం విలేఖరి ఎర్ర కుమారస్వామి , మండల సిబ్బంది తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే దొంతి



**ప్రజాపక్షం / నర్సంపేట :** గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరించిన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శుముగ్గుల పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా గత పది సంవత్సరాలుగా గోక లీలావతి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి 2025 ముగ్గుల పోటీల్లో స్థానిక మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని కోరారు. ఇలాంటి మంచి కార్యక్రమాలను మన నియోజకవర్గ పరిధిలో గత పదేళ్లుగా నిర్వహిస్తున్న గోక లీలావతి ట్రస్ట్ చైర్మన్ గోక వినోద్ బాబు, స్వప్న, దంపతులను గోక లీలావతిట్రస్ట్అధ్యక్షుడు రామస్వామిను అభినందించారు.

## ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి:ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కొడకండ్ల:** నూతన సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సి రాజేందర్‌రెడ్డిలకు పాలకుర్తి క్యాంప్ ఆఫీస్‌లో కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఏఎంసీ డైరక్టర్లు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి




**ప్రజాపక్షం/రాయపర్తి:** మండలం లోని తిర్మలాయపల్లి గ్రామంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే 194వ జయంతి వేడుకలను బిసి హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఈ సందర్భంగా మా చిత్రపటానికి బిసి హక్కుల పోరాట సమితి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులతో కలసి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సావిత్రి బాయి పూలే దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా పేరు తెచ్చు కున్నారని తెలిపారు. 18 ఏళ్ల వయస్సులోనే 50 పాఠశాలలు స్థాపించి ఉచిత విద్యను అందించారని అన్నారు. కుల మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణి, ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన నిజమైన చదువుల తల్లి సావిత్రిబాయి పూలే అన్నారు.. ఈ సందర్భంగా కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బిసి మండల మహిళా నాయకురాలు బోట్ల లక్ష్మి, గజవెల్లి అనంతప్రసాద్, పాము మనోహర్, ముద్రబోయిన వెంకన్న, నాగార్జున, బీసీ యూత్ మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎపి సంపర్ క్రాంతి రైలు నుంచి జారిపడి ప్రయాణికుడు మృతి

**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** రైలు నుండి జారిపడి ఓ ప్రయాణికుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం రఘునాథపల్లి రైల్వేస్టేషన్ దగ్గర చోటు చేసుకుంది. స్థానికులు, జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ చార్‌బౌలి ప్రాంతానికి చెందిన మహ్మద్ అలీముద్దీన్ (50) తన సొంత పనుల నిమిత్తం సికింద్రాబాద్ వెళ్లేందుకు కాజీపేట రైల్వేస్టేషన్‌కు చేరుకుని ఏపీ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలెక్కి సికింద్రాబాద్‌కు బయల్దేరాడు. ఈ క్రమంలో రైలు రఘునాథపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్న క్రమంలో మహ్మద్ అలీముద్దీన్ ప్రమాదవశాత్తు కాలుజారి రైల్వేప్లాట్ ఫామ్‌పై నుండి జారి రైలు చక్రాల కింద పడడంతో తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని సమాచారం అందుకున్న జనగామ జీఆర్‌పీ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదుచేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమర్‌గౌడ్‌ను కలిసిన బుడిగె సతీష్



**ప్రజాపక్షం/గూడూరు:** టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను గూడూరు మండలం గ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బుడిగె సతీష్‌గౌడ్ నూతన సంవత్సరం సందర్భంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. బిసి సమస్యలపై చర్చించారు. అలాగే గౌడ్ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యత కల్పించాలని కోరారు. బిసిలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తోందని, దానికి ఉదాహరణ తానేనని చెప్పచ్చని, రానున్నరోజుల్ల బిసిలకు అన్ని విషయాల్లో సముచిత స్థానం దక్కుతుందని బరోసా ఇచ్చారు. డిజిటల్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలిచిన బుడిగె సతీష్‌ను అభినందించారు.

# సావిత్రిబాయి సేవలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మహాత్మా జ్యోతిబా పులే సతీమణి, బాలికా విద్య కోసం కృషి చేసిన సావిత్రీబాయి పులే చేసిన పోరాటం ప్రతీ ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని, వారి ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ రోజు శుక్రవారం రోజున సావిత్రీ బాయి పులే జయంతి (మహిళా ఉపాధ్యాయ దినోత్సవం) సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్‌లోని ఐడిఒసి సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రాహుల్ శర్మ, ఇతర జిల్లా అధికారులతో కలిసి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. అనంతరం సావిత్రీబాయి పులే చిత్రం పటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బహుజన చైతన్య స్ఫూర్తి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ప్రజా ప్రభుత్వం వినూత్న నిర్ణయం తీసుకుందని అన్నారు. మహిళల విద్యకు ఆద్యురాలిగా నిలిచి, సమానత్వానికి పోరాడిన సావిత్రిబాయి పూలే జయంతి (జనవరి 3)ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవాలని ప్రజా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం శుభపరిణామమన్నారు. పూలే ఆశయాల సాధనకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ సం దర్భంగా పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకోవాలని కోరారు. సమాజంలో చారిత్రాత్మకమైన మార్పుకు పూలే పునాది వేశారని అన్నారు. మహిళల విద్యకు ప్రా ధాన్యం కల్పించి, అణచివేయబడిన వర్గాలకు న్యాయం అందించేందుకు తమ జీవితాన్ని సైతం లెక్కచేయలేదని గుర్తు చేశారు. పలువురు టీచర్లకు జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందించి సన్మానం చేశారు. అదనపు కలెక్టర్లు విజయలక్ష్మి అశోక్ కుమార్, డిఇఒ రాజేందర్, పరీక్షల నియంత్రణ అధికారి మండల రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు దాట్ల శ్రీనివాస్, ముంజల రవీందర్ గౌడ్, శిరుప అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాలికా విద్యతోనే సామాజిక చైతన్యం

జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** బాలికా విద్యతోనే సామాజిక చైతన్యం సాధ్యమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్థానిక కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా, సామాజిక సంస్కర్త, ఆధునిక భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే 193వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, జెడ్‌పి సిఇఒ మాధురీ షాతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రతి ఏటా జనవరి 3న రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించాలని ఉత్తర్వులలో పేర్కొందన్నారు. ఆడపిల్లలు చదువులో రాణించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి రమేష్, డిప్యూటీ డిఇఒ సరిత, కలెక్టరేట్ ఎఒ మన్సూర్, జిసిడిఒ గౌసియా బేగం, బిసి సంక్షేమాధికారి రవీందర్, ఎస్‌సి సంక్షేమాధికారి విక్రమ్, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## హమాలీరేట్ల జిఒను విడుదల చేయాలి

ఎఐటియుసి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి , నంది అవార్డు గ్రహీత దామెర కృష్ణ




**ప్రజాపక్షం / వరంగల్ ప్రతినిధి :** పెరిగిన సివిల్ సప్లయ్ హమాలిరేట్ల జివో ను వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి, నంది అవార్డు గ్రహీత దామెర కృష్ణ అన్నారు. గత మూడు రోజు జరుగుతున్న నిరవధిక సమ్మె వరంగల్ జిల్లా ఏనుమాముల కేంద్రంలో సివిల్ సప్లయ్ హమాలి పాయింట్ వద్ద నిరవక సమ్మెను ఉద్దేశించి దామెర కృష్ణ మాట్లాడుతూ ప్రతి 2సంవత్సరాలకు ఒకసారి హమాలీ రేట్లు పెంచుటకు అంగీకరించి జి.ఓ. విడుదల చేసి ప్రతి 2 సంవత్సరాలకు ఒకసారి రేట్ల సవరణ చేస్తూ ప్రభుత్వం మరియు పౌరసరఫరాల శాఖ చిత్తశుద్ధితో హమాలీ కార్మికుల శ్రమను గుర్తించి హమాలీ రేట్లు పెంచటం జరుగుతుంది అన్నారు. గత ఒప్పందం ప్రకారం కొత్త రేట్ల ఒప్పందం జరగాల్సివున్నది. చర్చలు జరిపి కూలి రేట్లు పెంచిన ప్రభుత్వం పెంచిన గెజిట్ ప్రభుత్వ జీవోను విడుదల చేయక పోవడం విడ్డూరంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేక నిరవధిక సమ్మెకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని దానికి పూర్తి బాధ్య త ప్రభుత్వమే వహించాలని అన్నారు. దేవన బోయిన రాంబాబు, గంద్రకోట చం ద్రమౌళి, కుక్కల రాజు, బండి లింగ మూర్తి, సల్ల ఒక్కయ్య, గుండపు కుమార్, అంబార బోయిన కుమార్, బైకాని అనిల్, పోషాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీరు అందించడమే లక్ష్యం

స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ప్రతీ ఎకరానికి గోదా, వరి జలాలు అందించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ఏకైక లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ ఎకరానికి సాగునీరు అందించడమే లక్ష్యంగా హన్మకొండ కనకదుర్గ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలో ఎత్తిపోతల పనులను వేగవంతం చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్లోగా ఎగువ ప్రాంతాల్లోని గ్రామాలకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. లిఫ్ట్2 పనులను ప్రారంభించి హన్మకొండ జిల్లా వే లేరు మండలంలోని గుండ్లసాగరం, సోడషపల్లి తదితర గ్రా మాలకు సాగు నీరందిస్తున్నామని, వారం రోజుల్లోనే లిఫ్ట్1, లిఫ్ట్ 3 పైప్ లైన్, పంప్ హౌస్ పనులను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ లిఫ్ట్ ల ద్వారా చిల్పూర్ మండలంలోని శ్రీపతిపల్లి, కొండాపూర్, లింగంపల్లి, మల్కాపూర్, నష్కల్, వంగాలపల్లి ధర్మసాగర్ మండలంలోని పీచర, వేలేరు, మద్దెలగూడెం, మల్లికుదుర్ల గ్రామాల రైతాంగానికి రెండు పంటలకు సాగునీరందుతుందని స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ శాఖ ఈఈలు ప్రవీన్, సీతారాం, డిఇలు శ్రీకాంత్, కృష్ణప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఏజన్సీలు పాల్గొన్నారు.

# బిసిల అభ్యుదయం కోసం ప్రభుత్వం కృషి

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** కాకతీయ యూనివర్సిటీ బిసి విద్యార్థి సంఘం ఇన్‌చార్జి ఆరేగంటి నాగరాజు గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సావిత్రిబాయి పూలే 194వ, జయంతి కెయు దూ విద్యా కేంద్రం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సావిత్రి భాయి పూలే జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించినందుకు తెలంగాణ ప్రజలు గర్వపడాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బిసిల అభివృద్ధి కోసం పాటు పడుతుందని, ఎన్నకల ముందు ఇచ్చిన వాగ్దానం ప్రకారం బిసి కుల గణన పూర్తి చేసి, బిసిలకు స్థానిక సంస్థలు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. మహిళా అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, కుల వివక్ష పైన అలుపెరగని పోరాటం చేసిన మహిళా ఉద్యమరాలు, సామాజిక సంఘసంస్కర్త సావిత్రిబాయి పూలే అని, సావిత్రిబాయి ఆశయాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అని అన్నారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె. ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షించదగ్గ విషయమని మహిళా ఉపాధ్యాయులకు ఎంతో గర్వకారణమని అన్నారు. బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బైరి రవికృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ప్రకటించడం పట్ల బిసిసమాజం హర్షం వ్యక్తం చేస్తున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ మల్లారెడ్డి, బిసి సెల్ డైరెక్టర్ ఆకుతోట శ్రీనివాస్, బిసి సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనగాని యాదగిరి గౌడ్, కేయు పాలకమండలి సభ్యులు డా.చిర్ర రాజు గౌడ్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి బచ్చు ఆనందం, బిసి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు అశోక్ గౌడ్, రీసెర్చ్ స్కాలర్ సోమరాజు, బిసి విద్యార్థి సంఘం కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షులు శాగంటి సుమన్ రాజ్, మహిళా కన్వీనర్ జాహ్నవి, ఉపాధ్యక్షులు జిర్కపల్లి రత్నం, గణేష్ , అజయ్ సింగ్, తరుణ్, కోశాధికారి రవితేజ, కార్యవర్గ సభ్యులు హర్షవర్ధన్, కోఆర్డినేటర్ వేణు, నితిన్ పాల్గొన్నారు.

## హమాలీ కార్మికులతో చర్చలు జరిపాలి




**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** సివిల్ సప్లయి హమాలీ కార్మికులతో చర్చలు జరిపి పెంచిన రూ.29 జిఒను విడుదల చేసి సమ్మె ఉధృతం కాకుండా చూసుకోవాలని సివిల్ సప్లయి హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. శుక్రవారం ఎఐటియుసి ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ సమ్మెను ప్రారంభించారు. ఈ సమ్మెలో పాల్గొన్న గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడుతూ హమాలీ రేట్ల రూ.26 నుండి రూ.29 జిఒను 31 డిసెంబర్‌వరకు విడుదల చేస్తామన్న కమిషనర్ ఇంతవరకు విడుదల చేయకపోవడం బాధాకరమన్నారు. 18 డిసెంబర్‌న సమ్మె నోటిస్ ఇవ్వడం జరిగిందని, అదేవిధంగా బోనస్‌ను రూ.7500 నుంచి రూ.10వేలకు పెంచాలని, కుట్టుకూలి రూ.1200 నుంచి రూ.1500, మహిళా కార్మికులకు రూ. 6వేల నుంచి రూ.10వేల ఇఎస్ఐ కార్డులు ఇవ్వాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. కమిషనర్ నిర్లక్ష్యం వలన ఈ సమ్మె కొనసాగుతుందని అన్నారు. కమిషనర్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని అన్నారు. సమ్మెలో మొలుగూరి రాంబాబు, రొంటాల రమేష్, ఇనుముల భిక్షపతి, ఇనుముల రఘుపతి, యాట పైడి, మాసపాక భిక్షపతి, లెంకలపల్లి రాజు, బోయిని నరేష్, కేతపాక సుమన్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిల్టర్ బెడ్ మరమ్మతు పనులు త్వరగా ప్రారంభించండి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఫిల్టర్ బెడ్ మరమ్మతు పనులను త్వరగా ప్రారంభించాలని ఇంజినీరింగ్ అధికారులను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. శుక్రవారం దేశాయిపేటలో బల్దియా నిర్వహిస్తున్న ప్రతాపరుద్ర ఫిల్టర్ బెడ్‌ను మేయర్ ఆకస్మికంగా తనిఖీ చేసి నీటి శుద్దీకరణ తీరు, నీటి నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ బెడ్‌లో కలియ తిరిగిన మేయర్ నీరు శుభ్రం చేసే క్రమాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిల్టర్ బెడ్‌లో మరమ్మతు పనులు చేపట్టడానికి.. చేపట్టాల్సి ఉందని రూ. కోటి మంజూరు చేసిన టెండర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసి వెంటనే పనులను ప్రారంభించాలన్నారు. వేసవి మొదలుకాక ముందే పనులను పూర్తి చేసి నగర ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఇఇ శ్రీనివాస్, డిఇ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మౌలిక సదుపాయాలే ప్రజాపాలన లక్ష్యం

ఎమ్మెల్యే జిఎస్ఆర్



**ప్రజాపక్షం/చిట్యాల:** ప్రజల మౌలిక సదుపాయాలే ప్రజాప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి నియోజకవర్గ చిట్యాల మండలంలోని వివిధ గ్రామాలలో ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ నాయకులతో పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించి, గ్రామాలలో పలు అభివృద్ధి పనులకు గండ్ర శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. లక్ష్మీంపూర్, నైన్ పాక, జూకల్ గ్రామాలల్లో ఇజిఎస్ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం చింతకుంట రామయ్యపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. తిరుమలాపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన పశు వైద్యశాలను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 12 మంది కల్యాణలక్ష్మీ లబ్ధిదారులకు 12, లక్షలపైగా విలువైన చెక్కులను అందజేశారు. జూకల్ గ్రామంలో ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రతీ ఒక్క పేదప్రజలకు అందేలా చూస్తున్నారని అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఆరోగ్యకరమైన పశుసంపదను పెంపొందించుకోవాలని, ఎన్నికల సమయంలో మండలానికి ఇచ్చిన అన్ని హామీలను త్వరలోనే నెరవేస్తామని, మండల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానన్నారు. మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఆయన తెలిపారు. స్థానిక తహసీల్దార్ నల్లబెల్లి హేమ, ఎంపిడిఒ జయశ్రీ,పలు శాఖల అధికారులు, ఎఎంసి చైర్ పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, కాంగ్రెస్ మండల అధ్యక్ష కార్యదర్శులు గూట్ల తిరుపతి, గడ్డం కొమురయ్య, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డికిష్టయ్య, నాయకులు ఓరం సమ్మయ్య, చిలుకల రాయకొమురు, కామిడీ రత్నాకర్ రెడ్డి, పులి తిరుపతిరెడ్డి, టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లకొండ, గ్రామాల నాయకులు నరేందర్, రామ్‌రెడ్డి,సంతోష్, తిరుపతి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## చదువుకున్న పాఠశాలకు బెంచీల విరాళం

జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివారెడ్డి



**ప్రజాపక్షం/మంగపేట:** విద్యార్థిని, విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివ రెడ్డి అన్నారు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన మండలంలోని అకినేపల్లి మల్లారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థుల విద్యాభ్యాసన సౌకర్యం కోసం యాభై వేల విలువైన ఇరువై బెంచీలను పాఠశాల విద్యార్థులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివ రెడ్డి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తాను విద్యను అభ్యసించిన పాఠశాల పేద విద్యార్థుల సౌకర్యార్థం బెంచీలను బహూకరించడం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి పుట్టి పెరిగిన ఊరు కోసం పాటుపడాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో తన భాగస్వామ్యం ఎప్పుడూ ఉంటుందని అంతేకాకుండా యాన్మార్ సంస్థ సహకారంతో పాఠశాలలో త్వరలో రక్షిత మంచినీటి వాటర్ ఆర్వో ప్లాంట్‌ను మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు సాంబశివరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి సహకరించిన సాంబశివరెడ్డిని పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బోదెబోయిన నరసింహారావు, ఉపాధ్యాయులు సరోజ రామ్‌సింగ్, దుర్గా ప్రసాద్, ప్రవీణ్‌కుమార్ పఠాన్, ఆస్మా బేగం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్యాయం కోసం పోరాడిన సంఘ సంస్కర్త పూలే

'పాస్' రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సంగని మల్లేశ్వర్

**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** దేశంలో సమన్యాయం కోసం పోరాడిన మహనీయులు జ్యోతిరావు అని పాస్,రాష్ట్ర డాక్టర్ సంగని మల్లేశ్వర్ అన్నారు. ఈరోజు పూలే ఆశయ సా ధన సమితి ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యా కేంద్రంలోని పూలే ప్రాంగణంలో 134వ వర్ధంతి సందర్భంగా పాస్, రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు విచ్చేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ గాంధీజీ కంటే ముందే మహాత్మగా పిలువబడ్డ జ్యోతిరావు పూలే అంబేద్కర్ వంటి మహనీయునికి స్ఫూర్తినిచ్చారని గుర్తు చేశారు. అధ్యక్షులు ప్రొఫెసర్ ఏ. సదానందం ప్రధాన కార్యదర్శి ప్రొఫెసర్ వడ్డే రవీందర్, పాస్ రాష్ట్ర కార్యదర్శి చంద మల్లయ్య, పాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్,జిల్లా ఉపాధ్యక్షులు బాబు యాదవ్, నాయకులు ప్రొఫెసర్ ఎం సారంగపాణి, ప్రొఫెసర్ సిహెచ్ సమ్మయ్య,డాక్టర్ పులి కోటేశ్వర్, డాక్టర్ ఆకుల శ్రీనివాస్, డాక్టర్ జగన్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్‌టియు డైరీ ఆవిష్కరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** ఎస్‌టియు హనుమకొండ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. రాంబాబు, వి. రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేనాయిని రాజేందర్‌రెడ్డి ఎస్‌టియు 2025 డైరీ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన సిపిఎస్ విధానం రద్దు చేయాలని, నెల రోజులుగా సమ్మె చేస్తున్న ఎస్ఎస్ఎ సిబ్బంది సమస్యలను పరిష్కరించే దిశగా చొరవ చూపాలని,పెండింగ్ లో ఉన్న డిఎలు ప్రకటించాలని రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి డాక్టర్ ఆట సదయ్య కోరగా నాయిని రాజేందర్ రెడ్డి స్పందిస్తూ సిపిఎస్ రద్దు కోసం కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీలు అన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు,రెండు జిల్లాల ఆర్థిక కార్యదర్శులు విద్యా సాగర్, తిరుపతి, బాధ్యులు పరమేశ్వర్, వీర ప్రతాప్,శివ కోటి,బాబు, మహేందర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## కేసుల సత్వర పరిష్కారానికి కృషి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్** : న్యాయస్థానాలలో పెండింగ్ లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్యాంశ్రీ న్యాయవాదులను కోరారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు జిల్లా న్యాయమూర్తిని తన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యాయస్థానాలలో పెండింగ్ లో ఉన్న కేసుల భారం అధికంగా ఉందని ఈ భారం ఏడాది కేడాదికి పెరిగిపోతుందని అందువల్ల సత్వర న్యాయం అందించడంలో జాప్యం జరుగుతుందన్నారు. కేసుల భారం తగ్గించడానికి న్యాయవాదుల సహకారం ముఖ్యమైనదని అందుకు న్యాయవాదులు సహకరించాలని ఆమె న్యాయవాదులను కోరుతూ వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి జక్కుల వీరయ్య,ఏజీపీ శ్రీనివాసులు,రేణుకాదేవి,న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు,రవికుమార్,కొట్టు సురేష్,నాగేశ్వరరావు,సైదాహుస్సేన్,నరేష్,నాగూర్‌పాషా,వెంకటేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు ఆహ్వానపత్రిక అందజేత



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి చెన్నకేశవ ఆలయంలో ఈనెల 13న జరిగే గోదాదేవి రంగనాద స్వామి కల్యాణ మహోత్సవం ఆహ్వాన పత్రికను స్థానిక నాయకులు ఎమ్మెల్యే వేముల వీరేశంకు అందేశారు. ఈనెల 10న జరిగే వైకుంఠ ఉత్తర ద్వారా దర్శనం, 11న కుడారై ఉత్సవాలతోపాటు ధనుర్మాసంలో జరిగే రోజువారి ఉత్సవాలను ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ లవణం ఉపేందర్, సింగిరెడ్డి మల్లారెడ్డి, గంగుల వెంకట్‌రెడ్డి, జినుకల ప్రభాకర్, బత్తుల కృష్ణగౌడ్, ఎండి.రేహాన్, గోదాసు పృద్వీరాజ్, వనం చంద్రశేఖర్, జిల్లా వెంకటేష్, జమీరొద్దిన్, గోదాసు సుగ్రీవులు, గుత్తా నర్సిరెడ్డి, బట్టె సంతోష్, బొడ్డు సాలయ్య, ఉప్పు ప్రకాశ్, బొడ్డు శంకయ్య, ఆలయ పూజారి గోవర్ధనచార్యులు, కొంపెల్లి సురేష్, రాఘవుల అనంతకుమార్ పాల్గొన్నారు.

## నిజాలను నిగ్గు తేల్చడమే పత్రికల లక్ష్యం



**ప్రజాపక్షం/మోటకొండూర్:** నిజాలను నిగ్గు తేల్చడమే పత్రికల లక్ష్యం అని,సమాజంలో జరుగుతున్న మంచి చేడులను ప్రజలకు తెలియజేయడంలో పత్రిక లు దోహదపడుతాయని మోటకొండూరు ఎస్ఐ ఎస్ పాండు అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూరు పోలీసు స్టేషన్‌లో 'ప్రజాపక్షం' దిన పత్రిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్ట్ లు ప్రజలను చైతన్య పరుస్తూ మంచి కథనాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూమండ్ల అశోక్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీ : వృద్ధుడు మృతి


**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: బైక్ ఢీకొన్న సంఘటనలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కిష్టాపురం వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన కూలీ పనులు చేసే బిల్లా కృష్ణమూర్తి (70) గురువారం సాయంత్రం తన ఇంటి నుంచి కిష్టాపురం గ్రామంలోని పాల కేంద్రం వద్దకు వెళ్లి పాలు పోసి తిరిగి నడుచుకుంటూ అద్దంకి నార్కట్‌పల్లి రహదారిపై అద్దంకి వైపు నుంచి వచ్చే రోడ్డు ఎడమవైపుకు నడుచుకుంటూ వస్తుండగా కిష్టాపురంలో గొల్లగూరి రామ్మోహన్‌రెడ్డి ఇంటి ముందుకు వచ్చే సరికి సుమారు రాత్రి 7గంటల సమయంలో దామరచర్ల వైపు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న బుల్లెట్ మోటార్ సైకిల్‌ను నడుపుతున్న నోము నాగేష్ నే వ్యక్తి తన మోటార్ సైకిల్‌ను అతివేగంగా అజాగ్రత్తగా నడిపి కృష్ణమూర్తిని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తికి తీవ్రంగా గాయాలు కాగా అంబులెన్స్‌లో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అదే రోజు రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మతుని భార్య బిల్ల మహాలక్ష్మీ అమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కూతుళ్ల ఉన్నారు.

## రూ.4వేల కోట్లు విడుదల చేయాలి



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఎసి,ఎస్‌టి,బిసి,ఈ బి సి మైనార్టీ విద్యార్థుల కు గత రెండు సంవత్సరాల ఫీజు బకాయిలు 4వేల కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం 8 డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీవోకు అందజేశారు, ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మిర్యాల యాదగిరి.బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ లు మాట్లాడుతూ ఎసి,ఎస్‌టి,బిసి,ఈ బి సి మైనారీవిద్యార్థుల గత రెండు సంవత్సరాల ఫీజు బకాయిలను 4వేల కోట్ల రూపాయలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మునాస ప్రసన్న కుమార్, సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి జేరిపోతుల రమేష్ గౌడ్, అధికార ప్రతినిధి పుట్ట వెంకన్న గౌడ్, పున్నా రవీందర్,వల్లకీర్తి శ్రీనివాస్,పగిళ్ల కృష్ణ, సతీష్ యాదవ్ ,చెన్నూరు భరద్వాజ్,మునస శివ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌డిఆర్‌ను కలిసిన నాయకులు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంరెడ్డి దామోదర్ రెడ్డిని మున్సిపాలిటి పరిధిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన నాయకులు పిసిసి సభ్యులు కొప్పుల వేణారెడ్డితో కలిసి హైద్రాబాద్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆర్‌డిఆర్‌ను కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గవ్వా వెంకట్ రెడ్డి, మాలి మధుసూదన్ రెడ్డి, రాయల సైదులు ఉన్నారు.

# ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

### అభివృద్ధి బాధ్యత నాది బాధ్యతగా ఉండండి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/ నాంపల్లి:** మునుగోడుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేసే బాధ్యత తనదని మండలంలోని అధికారులు బాధ్యతయుతంగా ఉండి ప్రజలకు సేవలను అందించాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దాపురంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పాఠశాలలో సౌకర్యాలు, సిబ్బంది మొదలగు వాటిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని క్లస్టర్ హెల్త్ సెంటర్‌గా చేసి సిబ్బందిని పెంచి ప్రజలకు ప్రజలకు అన్ని సౌకర్యాలతో కూడిన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని ప్రతి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేలా చూస్తామన్నారు. ఆరోగ్య శాఖలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది చేసిన వినతిని ప్రభుత్వంతో దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఆదర్శ పాఠశాలలో సావిత్రి బాయి పూలే జన్మదినం సందర్భంగా ఏర్పాటుచేసిన ఉపాధ్యాయుని దినోత్సవం సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునుగోడు వ్యాప్తంగా విద్యా, వైద్యం, రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకొని ప్రభుత్వ నిధులు కేటాయించి అన్ని విధాలుగా అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. మండలంలో బెల్ట్ షాపులో నిర్వహించకుండా గ్రామస్తులు అధికారులు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి ఎలుకోటి వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు ఎర్రెడ్ల రఘుపతి రెడ్డి, పూల వెంకటయ్య కాంగ్రెస్ మండల అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, నాయకులు పెద్దిరెడ్డి రాజు, పానగంటి వెంకన్న గౌడ్, గఫార్, పానగంటి వెంకటయ్య పాల్గొన్నారు.

# గ్రూప్-4తో రెవెన్యూశాఖలో 47 మందికి ఉద్యోగాలు

### కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సమస్యతో వచ్చే ప్రజలకు అధికారులు సహాయం చేసి వారిని ఆదుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఇటీవల టిజిపిఎస్‌సి ద్వారా ఉద్యోగాలు పొందిన 47 మందికి కౌన్సిలింగ్ నిర్వహించి రెవెన్యూ శాఖలో పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కష్టపడి ఉద్యోగం సాధించుకున్నందున అభినందనలు తెలిపారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలతో మంచిగామెలిగి ఉత్తమ సేవలు అందించి వారి మన్ననలు పొందాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలు అర్హులైన చివరి వ్యక్తికి అందేలాపని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటెండెంట్ పద్మారావు, సిబ్బంది, అభ్యర్థులు పాల్గొన్నారు.



### రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన

రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ రోడ్డు భద్రత మాస వారోత్సవాల 2025 గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో నెలరోజుల పాటు జాతీయ రహదారి భద్రత మాస వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు రోడ్డు భద్రత పట్ల అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించాలని రవాణా శాఖ అధికారుకు సూచించారు. పల్లె నుండి పట్టణాల వరకు సురక్షిత రవాణాలపై ప్రచార యాత్రలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ పి రాంబాబు, జిల్లా రవాణా అధికారి జి సురేష్ రెడ్డి, అధికారులు జయప్రకాష్ రెడ్డి, ఆధిత్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

# ధరణి పోర్టల్ దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

### కట్టంగూరు తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/ (నల్లగొండ)కట్టంగూరు** : ధరణి పోర్టల్‌లో అన్ని మాడ్యూల్స్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. శుక్రవారం ఆమె జిల్లా కట్టంగూరు తహసిల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ధరణి పోర్టల్ ను పరిశీలించారు. పోర్టల్ లో వివిధ మాడ్యూల్స్ కింద పెండింగ్లో ఉన్న దరఖాస్తులను, ఫైళ్లను ఆమె పరిశీలించి తహసిల్దార్ ప్రసాద్ కు, సిబ్బందికి తగు సూచనలు చేశారు.భూములకు సంబంధించి ఇప్పటివరకు సంతకం చేయని ఖాతాలను గ్రామం వారిగా పరిశీలించాలని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే మీ సేవ దరఖాస్తులను సైతం ఆమె సమీక్షించి వేగవంతం చేయాలని చెప్పారు.అనంతరం జిల్లా కలెక్టర్ పక్కనే ఉన్న ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో స్థానికంగా ప్రసవాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మాత శిశు మరణాలు సంభవించకుండా చర్యలు చేపట్టాలని , గత నవంబర్, డిసెంబర్ నెలల్లో కట్టంగూర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో శిశు మరణాలు సంభవించడం పట్ల ఆమె స్పందిస్తూ తిరిగి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. తహసిల్దార్ ప్రసాద్, ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్ , ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్ తదితరులు ఉన్నారు.



# ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి : ఎస్‌పి

### సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలి

**ప్రజాపక్షం/ హాలియా:** ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించేలా పోలీస్ వ్యవస్థ మరింత పటిష్టంగా పనిచేయాలని నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు.మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలోని హలియ పోలీస్ స్టేషన్ ను ఆయన శుక్రవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ లో సిబ్బంది పని తీరు,పోలీసు స్టేషన్ పరిధిలోని పరిసరాలు, స్థితిగతులను యస్.ఐ సతీష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ మేనేజ్మెంట్, ఉమెన్ హెల్ప్ డెస్క్, స్టేషన్ రైటర్, లాక్ అప్, యస్.హెచ్.ఓ రూమ్ తదితర ప్రదేశాలను పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమర్ధవంతమైన సేవలు అందజేయాలన్నారు. సత్వర న్యాయం చేసేలా కృషి చేయాలని సూచించారు. కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా గ్రామాలలో సిసిటీవి లు ప్రాముఖ్యత అవగాహన కల్పిస్తూ వాటి ఏర్పాటుకు కృషి చేయాలని అన్నారు. సైబర్ క్రైమ్, దయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు ప్రతీ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు.దొంగతనాలు జరగకుండా పగలు,రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ లు చేస్తూ ముందస్తు నివారణ చర్యలు చేపట్టాలని పాత నేరస్థుల కదలికలపై నిఘా పెడుతూ విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం,అక్రమ ఇసుక, పిడియస్ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకోని వాటిని నియంత్రించాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబు దారీగా ఉంటూ బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా పని చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డి.యస్.పి రాజశేఖర రాజు,హాలియ సి.ఐ జనార్ధన్, యస్.ఐ సతీష్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది ఉన్నారు.





## శాంతిభద్రతల పరిరక్షణకు సమన్వయంతో పనిచేయాలి : ఎస్‌పి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లాలో శాంతిభద్రత పరిరక్షణకు పోలీసులు సమన్వయంతో పని చేయాలని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నూతన సంవత్సర కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ప్రతి సంవత్సరం పురోగతి చెందుతూ ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తుందన్నారు. నేరాల నివారణలో ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో సిబ్బంది ఆరోగ్యంగా ఉండి కుటుంబాలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు నాగేశ్వర్ రావు, జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పిలు శ్రీనివాసరావు, రవి, శ్రీధర్ రెడ్డి, మట్టయ్య, నరసింహచారి, ఏఓ మంజు భార్గవి, సిఐలు వీరరాఘవులు, రాజశేఖర్, శ్రీను, రఘువీర్ రెడ్డి, రాము, రజితారెడ్డి, రామకృష్ణారెడ్డి, చలమందరాజు, లక్ష్మి నారాయణ, నాగభూషణం, హరిబాబు, శివకుమార్, ఆర్ఐ నారాయణ రాజు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## భద్రత స్కీం చెక్కు పంపిణీ



పోలీస్ భద్రత పథకం పోలీసుల కుటుంబాలకు అండగా నిలుస్తుందని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఆర్మ్డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ రాములు కుటుంబ సభ్యులకు పోలీస్ భద్రత పథకం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల సంక్షేమం కోసం పోలీస్ శాఖ ఎప్పుడు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఏఓ మంజు భార్గవి ఉన్నారు.

## సేవా దృక్పథం అలవర్చుకోవాలి

**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్ :** జిల్లా రెడ్ క్రాస్ భవన్ ను సందర్శించిన మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ స్టాండింగ్ కౌన్సిల్ , న్యూఢిల్లీ ఎస్ రాగాసందేశ్ జిల్లా రెడ్ క్రాస్ భవన్ ను శుక్రవారం సందర్శించి రెడ్ క్రాస్ సంస్థ చేపడుతున్న వివిధ సామాజిక సేవ కార్యక్రమాలను తెలుసుకున్నారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మనం ఏ హోదాలో ఉన్నాము ఎంత సంపాదించాంఅనేది ముఖ్యం కాదని మన వంతుగా సమాజానికి ఏమి చేస్తున్నాం అనేది చాలా ముఖ్యమని అప్పుడే మనిషి జీవితం సార్థకత అవుతుందని చేయాలని నిర్ణయించుకున్నానని అది నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. సంస్థ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి మేనేజింగ్ కమిటీ మెంబర్స్ రెడ్ క్రాస్ మెంబర్స్ యూత్ వాలంటీర్స్ వారు జిల్లా ప్రజలకు అందిస్తున్న సేవలనుకు ప్రత్యేక అభినందనలు తెలిపారుఈ. కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ యూత్ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి,యూత్ వాలంటీర్స్ నేతి విప్లవ కుమార్,ఊర శివసాయి,బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జివి రాములు,సిబ్బంది సద్దాం హుస్సేన్ ,టెక్నీషియన్స్ ప్రదీప్ రెడ్డి,నిర్మల ,మురళీ కృష్ణ,హజ్మత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.




## జాతీయ రహదారి భద్రత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** జాతీయ రహదారి భద్ర మాసం అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను, బ్రోచర్‌ను శుక్రవారం సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంవీఐ వీరస్వామి, తహసీల్దార్ హరిబాబు పాల్గొన్నారు.



# మహిళా విద్యాభివృద్ధికి సావిత్రి బాయిఫూలే ఎనలేని సేవలు



**ప్రజాపక్షం/దేవరకొండ:** భారత దేశ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు, గొప్ప సంఘ సంస్కర్త, కవి సావిత్రి బాయి పూలే మహిళా విద్యాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా పట్టణంలోని ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. ప్రభుత్వం సావిత్రి బాయిపూలే జయంతి సందర్భంగా రాష్ట్ర మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో ఆర్డినేటర్ సిరాజ్‌ఖాన్, వెంకటయ్యగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ డా. వేణుధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు యూనుస్, మాజీ ఎంపిపి భవాని, మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం, సినియర్ నాయకులు యుగందర్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి అరుణసురేష్, రాంసింగ్, సతీష్, లాలానాయక్, సుభాష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సావిత్రిబాయి పూలే త్యాగాలతోనే సమాజంలో మార్పు మొదలైందని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సావిత్రిబాయి పూలే జయంతిలో అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం రాకముందే దేశంలో అనగారిన సమాజం కోసం, స్త్రీల హక్కులు, విద్య కోసం మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. వివిధ శాఖల అధికారులు అశోక్, లత, అనసూర్య, శ్రీధర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పద్మారావు, శ్రీలత, సాయిగౌడ్, మహిళ ఉపాధ్యాయురాళ్లు, మహిళ సిబ్బంది పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/ నాంపల్లి:** మహిళా ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నాంపల్లి మండలం లోని ప్రభుత్వ మోడల్ స్కూల్ లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యానులకు నులకు సన్మానం సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయునులకు శాలువా కప్పి పువ్వుల బొకేను అందజేసి అనంతరం సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళ లోకానికి ఒక దిక్సూచి లాగా దారి చూపిందని,బ్రాహ్మణీయ భావజాలానికి వ్యతిరేకంగా, అంటరానితనం, కుల వివక్షత వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేశారని, మహిళలకు మొదటిసారిగా విద్యను నేర్పించిన మొదటి గురువు కొనియాడారు. నేటి మహిళలు చైతన్యవంతమై అణిచివేత, ఆధిపత్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల నాయకులు వెంకటాచారి, సందీప్, మహేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దేశ ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే జయంతి సందర్భంగా సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ తన కార్యాలయంలో శుక్రవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. బడుగువర్గాల, మహిళ విద్యను ప్రోత్సహించిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పరిపాలన అధికారి శ్రీనివాస్‌శర్మ, తహసీల్దార్ హరి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



